## క్లుప్తంగా

### రాష్ట్ర స్థాయి షూటింగ్ బాల్ పోటీలకు ఎంపిక



**హనుమాన్‌జంక్షన్ రూరల్:** బాపులపాడు మండలం వీరవల్లి జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు రాష్ట్ర స్థాయి షూటింగ్ బాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయురాలు పి.నిర్మల తెలిపారు. ఇటీవల జరిగిన జిల్లా జట్టు సెలక్షన్స్‌లో సబ్ జూనియర్ బాలికల జట్టుకు ఎ.చంద్రిక, బాలుర జట్టుకు షేక్ గౌస్, సీహెచ్ సాయిప్రకాష్ ఎంపికయ్యారన్నారు. ఈ నెల 10, 11వ తేదీల్లో కుప్పంలో జరగబోయే రాష్ట్ర స్థాయి షూటింగ్ బాల్ పోటీల్లో వీరంతా కృష్ణా జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారని చెప్పారు. ఎంపికైన విద్యార్థులను హెచ్ఎం నిర్మల, వ్యాయామోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, గ్రామ ప్రముఖులు అభినందించారు.

### వయనాడ్ వరద బాధితులకు విరాళాల సేకరణ



**గన్నవరం:** కేరళ రాష్ట్రంలోని వయనాడ్ వరద బాధితులను ఆదుకునేందుకు ప్రజలు స్వచ్ఛందంగా ముందుకురావాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వై.నరసింహారావు పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం వరద బాధితుల సాయం కోసం సీపీఎం ఆధ్వర్యంలో గన్నవరం పట్టణంలో విరాళాలను సేకరించారు. ఇటువంటి విపత్కర సమయంలో బాధిత కుటుంబాలకు అండగా నిలవాలని కోరారు. పట్టణ ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి వరద బాధితులకు రూ.15,980 విరాళంగా ఇచ్చారన్నారు. పార్టీ నాయకులు కళ్లం వెంకటేశ్వరరావు, టి.వి.లక్ష్మణస్వామి, మిరప నాగేశ్వరరావు, బాబావలి, గుండెమెడ ఉదయ్‌భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

### సస్యరక్షణ చర్యలు పాటించాలి

**గన్నవరం రూరల్:** మండలంలోని ఉద్యాన పంటల రైతులు సస్యరక్షణ చర్యలు పాటించాలని మండల ఇన్‌చార్జి అధికారి హరిచంద్ సూచించారు. గురువారం ఆయన మాట్లాడుతూ కూరగాయల సాగు రైతులు పడిపోయిన మొక్కలను జాగ్రత్తగా నిలబెట్టి మొదలు దగ్గరగా మట్టిని ఎగదోయాలని చెప్పారు. మొక్కలకు సరిపోయినంత ఆకులు, కొమ్మలతో ఉంటే నీటిలో కరిగే ఎరువు మల్టీకే ద్రావణాన్ని 2 నుంచి 3 సార్లు మొక్క తడిచేటట్లుగా వారం రోజుల వ్యవధిలో పిచికారీ చేయాలన్నారు. కొత్తగా నాటిన విత్తనాలు తీసివేసి మరలా నాటుకోవాలని చెప్పారు. పంటకు ఆకుమచ్చ, కాయకుళ్లు, బూజు తెగుళ్ల ఉధృతి అధికంగా ఉంటే లీటరు నీటికి 2.5 గ్రాముల సాఫ్ మందును కలిపి రెండు సార్లు పిచికారీ చేయాలని తెలిపారు.

### ఆధునిక సాఫ్ట్‌వేర్‌తో సివిల్ రంగంలో పెను మార్పులు



**పెనమలూరు:** సివిల్ రంగంలో మారుతున్న సాంకేతిక పరిజ్ఞానానికి ఆధునిక సాఫ్ట్‌వేర్ ఎంతగానో దోహదపడుతుందని పీవీపీ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కొండపల్లి శివాజీబాబు అన్నారు. కానూరులోని కాలేజీలో మూడు రోజుల రివిట్ సాఫ్ట్‌వేర్ ప్రోగ్రామ్ శిక్షణ తరగతులను ఆయన గురువారం ప్రారంభించి మాట్లాడారు. సాఫ్ట్‌వేర్‌ను ఉపయోగించుకొని నేడు అత్యాధునిక భవనాలు, రోడ్ల నిర్మాణాలు జరుగుతున్నాయన్నారు. సివిల్ విభాగాధిపతి డాక్టర్ వి.జగదీష్ మాట్లాడుతూ.. ఆధునిక సాంకేతికత దేశ అభివృద్ధికి ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. సివిల్ రంగంలో వస్తున్న మార్పులను విద్యార్థులు అవగాహన చేసుకొని మంచి ఫలితాలు సాధించాలని సూచించారు. కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

### మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

**ఉంగుటూరు:** మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వంట ఏజెన్సీలు ఎంఈఓ కార్యాలయంలో సిబ్బందికి గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తమపై రాజకీయ ఒత్తిళ్లు లేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. మధ్యాహ్న భోజన పథకానికి అవసరమైన మొత్తం గ్యాస్ సిలిండర్లను ప్రభుత్వమే ఇవ్వాలన్నారు. అలాగే వంట షెడ్లు నిర్మించి, వంట సామగ్రిని ప్రభుత్వమే అందజేయాలన్నారు. రాగి జావకు డబ్బులు ఇచ్చి మెనూ చార్జీలు పెంచాలని, ఉద్యోగ భద్రతను కల్పించాలని వినతి పత్రంలో డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వంట ఏజెన్సీల సంఘం మండల అధ్యక్షురాలు మహబూబ్, సంఘ సభ్యురాలు నాగమణి, సీఐటీయూ మండల కార్యదర్శి కె.రామరాజు, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి అజ్మీర వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

# చివరి భూములకు సాగునీరు ప్రశ్నార్థకమే..?



పిచ్చి కంప కాదు.. మొక్కలతో నిండిపోయిన నంబిగుంట కాలువ



కంకిపాడు సెక్షన్ నుంచి చీలే కాలువలో పేరుకుపోయిన గుర్రపుడెక్క

- తూడు, గుర్రపుడెక్కతో నిండిపోయిన కాలువలు
- మురుగు పోయే మార్గం లేకుండా డ్రెయిన్లు
- ఆందోళనలో అన్నదాతలు

**కంకిపాడు:** పంట కాలువలు, డ్రెయినేజీ బోదెలు తూడు, గుర్రపుడెక్క, పిచ్చికంపతో నిండిపోయాయి. ఏ కాలువలో చూసినా ఇదే పరిస్థితి. పెనమలూరు నియోజకవర్గంలోని కంకిపాడు, కోమటిగుంట రెగ్యులేటర్ల పరిధిలోని ప్రధాన కాలువలకు అనుసంధానంగా ఉన్న అనేక పంట కాలువలు, డ్రెయినేజీ బోదెలు అధ్వాన స్థితిలో ఉన్నాయి. తూడు, గుర్రపుడెక్క తొలగింపులకు అధికారులు సరైన చర్యలు తీసుకోకపోవటంతో ప్రస్తుతం రైతాంగం అవస్థలు పడే పరిస్థితి నెలకొంది. ఎగువ నుంచి, రెగ్యులేటర్ల నుంచి పంపిణీ చేసే సాగునీరు కాలువ చివరి భూములకు చేరటం ప్రశ్నార్థకంగా తయారైంది. ఇప్పటికే బోర్లు, ఆయిలు ఇంజిన్లపై ఆధారపడి రైతాంగం సాగుకు అవసరమైన నీటిని సమకూర్చుకుంటున్నారు. గుర్రపుడెక్క, తూడు తొలగించకపోవటంతో సాగునీరు చివరి వరకూ చేరటం లేదు. దీనికి తోడు డ్రెయినేజీ బోదెల్లోనూ పేరుకుపోయిన వ్యర్థాలు, పిచ్చి కంపతో పొలాల్లో మురుగు అత్యవసర పరిస్థితుల్లో బోదెల్లోకి మళ్లించటం కష్టసాధ్యమవుతుంది. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పొలాల్లో నిలిచిన నీరు కాలువలు, బోదెల్లోకి మళ్లించకపోవటంతో మండలంలోని గొడవర్రు, దావులూరు, మంతెన - జగన్నాథపురం ప్రాంతాల్లో వరి పొలాలు ముంపు బారిన పడ్డాయి. తాము ఎదుర్కొంటున్న ఇక్కట్లను గుర్తించి కాలువలు, బోదెల్లో తూడు, గుర్రపుడెక్క, పిచ్చి కంప తొలగింపునకు అధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

# తల్లి పాలు అమృత తుల్యం



కంకిపాడులో తల్లి పాల వారోత్సవాల ర్యాలీలో చిన్నారులు, తల్లులు, అంగన్‌వాడీ సిబ్బంది



ఉయ్యూరులో అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ బేబి సుకన్య

**కంకిపాడు:** తల్లి పాలు అమృత తుల్యమని కంకిపాడు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సూపర్‌వైజర్ ఎస్.అన్నామణి అన్నారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా కంకిపాడులోని 4వ అంగన్‌వాడీ కేంద్రంలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాలను గురువారం ఘనంగా నిర్వహించారు. తల్లి పాల విశిష్టతపై బాలింతలు, గర్భిణులకు అవగాహన కల్పించారు. తల్లి పాల ప్రాముఖ్యత, ప్రయోజనాలపై అవగాహనా ర్యాలీ నిర్వహించారు. అన్నామణి మాట్లాడుతూ.. బిడ్డ పుట్టిన దగ్గర నుంచి ఆర్నెల్ల వరకూ క్రమం తప్పకుండా తల్లిపాలు ఇవ్వాలని సూచించారు. బిడ్డలో వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని, స్త్రీల ఆరోగ్య సమస్యలకు తెరపడుతుందన్నారు. గర్భిణిగా ఉండగానే మంచి ఆహారం తీసుకోవటం ద్వారా పాల ఉత్పత్తి అధికంగా ఉంటుందని చెప్పారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో లభించే ఆహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు వై.లత, లక్ష్మి, రత్న, మీన, రాజ్యలక్ష్మి, భవాని, కృష్ణవేణి, గర్భిణులు, బాలింతలు, చిన్నారులు పాల్గొన్నారు.

**తల్లి పాలే బిడ్డకు శ్రేష్టం**

**ఉయ్యూరు:** తల్లి పాలే బిడ్డకు శ్రేష్టమని కంకిపాడు సీడీపీఓ బేబీ సుకన్య అన్నారు. ఉయ్యూరు పట్టణంలోని ఉర్దూ సెంటర్ అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం తల్లి పాల వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ బేబీ సుకన్య మాట్లాడుతూ.. తల్లిపాల వారోత్సవాలను బాధ్యతతో నిర్వహించాలన్నారు. తల్లి పాల ఆవశ్యకతను తెలియజేయాలని సూచించారు. తల్లి పాలతో వ్యాధి నిరోధక శక్తి పెంపొందుతుందన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ కల్యాణి, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

## ఎస్సీ వర్గీకరణపై సుప్రీం తీర్పుతో హర్షాతిరేకాలు



నున్నలో ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

**నున్న(విజయవాడరూరల్):** ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు గురువారం అనుకూలంగా తీర్పు వెల్లడించడంతో మాదిగ కులస్తులు హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణమాదిగ ఎస్సీ వర్గీకరణ కోరుతూ గత 30 సంవత్సరాలుగా చేసిన ఉద్యమాల ఫలితంగా వర్గీకరణ సాధించుకున్నామనే ఆనందంతో ర్యాలీ నిర్వహించారు. ఈ తీర్పుతో విద్య, ఉపాధి రంగాల్లో ముందుకెళ్లేందుకు అవకాశాలు లభిస్తాయని ఉమ్మడి కృష్ణా జిల్లా ఎమ్మార్పీఎస్ కార్యదర్శి మందా వేణుబాబు ఆశాభావం వ్యక్తం చేశారు. ఎస్సీ వర్గీకరణకు సంబంధించి రాష్ట్రాలు చేసుకోవచ్చునని సుప్రీంకోర్టు చెప్పడం తెలుగు రాష్ట్రాల్లో వర్గీకరణ అనివార్యమన్నారు. ఇందుకు సహకరించిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్రమంత్రి కిషన్ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో గన్నవరం నియోజకవర్గం ఎమ్మార్పీస్ ఇన్‌చార్జి ఎర్రగుంట వినోద్ మాదిగ, మహాజన సోషలిస్ట్ కో ఇన్‌చార్జి చిల్లిముంత కోటేశ్వరరావు మాదిగ, నాయకులు తగరం సుబ్బారావు మాదిగ, తగరం నాని మాదిగ, ప్రత్తిపాటి సుందరయ్య మాదిగ తదితరులు పాల్గొన్నారు.

### ఎస్ఎంసీలకు ఓటర్లుగా నమోదు చేసుకోవాలి

**విజయవాడరూరల్:** ప్రభుత్వ పాఠశాలల్లో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీల ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసిన నేపథ్యంలో పోటీ చేసే విద్యార్థుల తల్లిదండ్రులు ఓటర్లుగా నమోదు చేయడానికి తమ వివరాలను ఆయా స్కూల్స్‌లోని ప్రధానోపాధ్యాయులకు అందజేయాలని విజయవాడ రూరల్ మండల విద్యాశాఖాధికారి-2, ఏ.సూరిబాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒక్కో తరగతికి ముగ్గురు చొప్పున సభ్యులు ఎన్నికవుతారని వారిలో ఎస్సీ, బీసీ, ఓసీ సభ్యులు ఉంటారన్నారు. వారి నుంచి స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నుకుంటారు. ప్రధానోపాధ్యాయులు కన్వీనర్‌గా వ్యవహరిస్తారు. వీరి పదవి కాలం రెండేళ్లు ఉంటుంది. ఒక్కో స్కూల్‌లో ఈ కమిటీలో 15 మంది సభ్యులుంటారు. వారిలో 66 శాతం మహిళలు సభ్యులుగా ఉండాలి. 5వ తేదీన ఓటర్ల జాబితాపై అభ్యంతరాలను పరిశీలిస్తారు. 8వ తేదీన ఉదయం 7 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఎన్నికలు నిర్వహిస్తామని ఎంఈఓ సూరిబాబు తెలిపారు.

### బైక్ చోరీపై కేసు నమోదు

**పెనమలూరు:** కానూరులో బైక్ చోరీపై పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పెనమలూరు క్రైమ్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కానూరు సనత్‌నగర్ 3వ లైన్‌కు చెందిన వై.నాగేంద్రబాబు గత జూన్ నెలలో రూ.1.42 లక్షలతో బైక్ కొన్నాడు. అయితే అదే నెల 29వ తేదీన బైక్ తన ఇంటి ముందు పార్కు చేశాడు. గుర్తు తెలియని వ్యక్తులు బైక్‌ను చోరీ చేశారు. బైక్ కోసం అనేక ప్రాంతాల్లో వెతికినా ఫలితం లేకపోవడంతో గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో పోలీసులు కేసు నమోదు చేశారు.

## హెల్మెట్ వినియోగంపై అవగాహన ర్యాలీ



కానూరులో ర్యాలీ నిర్వహిస్తున్న ఇంజినీరింగ్ విద్యార్థులు

**పెనమలూరు:** హెల్మెట్ వినియోగంపై అవగాహన కల్పించేందుకు కానూరు వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీ ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, అధ్యాపకులు గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ ఏవీ రత్నప్రసాద్ మాట్లాడుతూ.. ద్విచక్ర వాహనాలపై ప్రయాణం చేసే సమయంలో తప్పనిసరిగా హెల్మెట్‌లు ధరించాలని సూచించారు. రోడ్డు ప్రమాదాలు జరిగిన సమయంలో హెల్మెట్‌లు ప్రమాదాల నుంచి కాపాడతాయన్నారు. హెల్మెట్ తలకు రక్షణ కవచం వంటిదని చెప్పారు. ఈ సందర్భంగా కాలేజీ నుంచి 100 అడుగుల రోడ్డు వరకు హెల్మెట్‌లు ధరించి బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ కొల్లా నరేంద్ర, ఇంగ్లిష్ విభాగాధిపతి డాక్టర్ రవిచంద్, వివిధ విభాగాధిపతులు, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

## టీడీపీ జెండాలతో ఇసుక ట్రాక్టర్ హల్‌చల్



గ్రామస్తులు పట్టుకున్న ఇసుక ట్రాక్టర్

**పెనమలూరు:** చోడవరంలో టీడీపీ నేత ఇసుక అక్రమంగా తరలిస్తుండగా గ్రామస్తులు గురువారం ట్రాక్టర్‌ను అధికారులకు పట్టించారు. అయితే గ్రామస్తులు పట్టించిన ట్రాక్టర్‌ను అర గంటలోనే రెవెన్యూ అధికారులు రిలీజ్ చేసి స్వామి భక్తిని చాటుకున్నారు. చోడవరంలో అక్రమ ఇసుకపై సాక్షి దినపత్రికలో కథనాలు రావటంతో ఇసుక తవ్వకాలు నిలిచాయి. దీంతో గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు. అయితే టీడీపీ నాయకుడు తన ట్రాక్టర్‌కు టీడీపీ జెండాలు కట్టి, గ్రామంలో తన ఇసుక డంప్ నుంచి ఇసుక తరలిస్తుండగా గ్రామస్తులు రెవెన్యూ అధికారులకు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టించారు. ఇసుక తరలించే ట్రాక్టర్‌కు నంబర్ లేదు. ట్రాక్టర్ డ్రైవర్ వయస్సు 18 ఏళ్లు ఉంటాయి. గ్రామస్తులు పట్టించిన ట్రాక్టర్‌ను రెవెన్యూ అధికారులు పెనమలూరు తహసీల్దార్ కార్యాలయానికి తరలించారు. వెంటనే టీడీపీ బడా నేత నుంచి ఫోన్ రావడంతో ట్రాక్టర్‌ను వదిలేశారు. ఈ విషయమై ఇన్‌చార్జి తహసీల్దార్ శ్రీనివాసరావును వివరణ కోరగా ట్రాక్టర్‌కు రూ.5 వేలు జరిమానా విధించామన్నారు. మిగతా వివరాలు తెలపలేదు.

## అపార్టుమెంట్ విక్రయిస్తానని రూ.9 లక్షలు స్వాహా

**పెనమలూరు:** తాడిగడపలో అపార్టుమెంట్ విక్రయిస్తానని రూ.9 లక్షలు స్వాహా చేసిన వ్యక్తిపై పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ టీవీవీ రామారావు తెలిపిన వివరాల ప్రకారం విజయవాడ చిట్టినగర్ మిల్క్ ప్రాజెక్టు క్వార్టర్స్‌లో ఉంటున్న నర్రా వెంకట్రావు అపార్టుమెంట్ కొనే ఆలోచనలో ఉన్నాడు. అయితే మిల్క్ ప్రాజెక్టులో డ్రైవర్‌గా పని చేసే శౌరిబాబు, వెంకట శ్రీనివాసరావు, జి.సురేష్‌లు కలిసి వెంకట్రావు తాడిగడప శ్రీవిఘ్నేశ్వర ప్లాజాలో చెరుకూరి వసంతరావు ఉంటున్న అపార్టుమెంట్‌ను కొనటానికి 2018లో వెళ్లారు. అపార్టుమెంట్ నచ్చడంతో రూ.50 వేలు టోకెన్ అడ్వాన్స్ ఇచ్చారు. ఆ తరువాత అగ్రిమెంట్ రాసి రూ.7.50 లక్షలు వెంకట్రావు అడ్వాన్స్‌గా వసంతరావుకు చెల్లించాడు. అపార్టుమెంట్ కాగితాలు తీసుకోని వెంకట్రావు బ్యాంకు లోన్‌కు వెళ్లగా లింక్ డాక్యుమెంట్లు సరిగా లేవని బ్యాంకు లోన్‌కు నిరాకరించింది. అనంతరం కరోనా రావటంతో వ్యవహారం నిలిచిపోయింది. 2024 జూన్‌లో తన సొమ్ము తనకు తిరిగి చెల్లించమని వెంకట్రావు వసంతరావును కోరగా కాగితాలు సరి చేస్తానని మళ్లీ రూ.లక్ష తీసుకున్నాడు. అయినా అతను కాగితాలు సరి చేయలేదు. తీసుకున్న నగదు చెల్లించమని వెంకట్రావు కోరితే వసంతరావు, అతని మనుషులు చంపుతానని బెదిరిస్తున్నారని బాధితుడు పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశాడు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

## ఆఖరి మజిలీలో తప్పని అవస్థలు



చెత్త కుప్పల మధ్య అంత్యక్రియలు చేస్తున్న క్రైస్తవులు

**రామవరప్పాడు:** విజయవాడరూరల్ మండలం రామవరప్పాడు బల్లెంవారి వీధిలోని ఎస్సీ శ్మశానవాటికలో బుధవారం చోటు చేసుకున్న ఘటన అత్యంత దయనీయ పరిస్థితికి సజీవ సాక్ష్యంగా నిలిచింది. ఈ శ్మశానంలోకి వెళ్లేందుకు కూడా వీలు లేకుండా పంచాయతీ చెత్తను డంప్ చేస్తుండటంతో అంత్యక్రియలు నిర్వహించేందుకు వచ్చిన క్రైస్తవులు నరకయాతన అనుభవించారు. ఒక పక్క కుప్పలుగా పేరుకుపోయిన చెత్త, మరో పక్క కుళ్లిన వ్యర్థాలతో వెదజల్లుతున్న తీవ్ర దుర్గంధంతో ముక్కుమూసుకుని మృతదేహాన్ని మట్టి చేయాల్సిన దీన పరిస్థితి నెలకుంది. కనీసం కడసారి ప్రార్థనలు నిర్వహించుకునేందుకు కూడా అవకాశం లేకపోవడంతో అంత్యక్రియలకు వచ్చిన వారు ఆ చెత్త, బురదలోనే పరదాలు పరుచుకుని, ముక్కు మూసుకుని ప్రార్థనలు చేశారు. గ్రామంలో పారిశుద్ధ్య నిర్వహణ అటకెక్కడం ఈ ఎస్సీ శ్మశానవాటికకు శాపంలా మారింది. ఇటు రామవరప్పాడు అటు ప్రసాదంపాడు గ్రామాలకు ఉన్న ఒకే ఒక్క ఎస్సీ శ్మశానానికి ఈ గతి పట్టించారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### వాడపల్లికి ఆర్టీసీ బస్సు సర్వీసు

**ఉయ్యూరు:** వాడపల్లి శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయానికి ఉయ్యూరు డిపో నుంచి ఆర్టీసీ ప్రత్యేక సర్వీసు నడుపుతున్నట్లు ఆర్టీసీ డిపో మేనేజర్ కేఎస్ఆర్‌కే ప్రసాద్ తెలిపారు. ఆగస్టు 3, 4వ తేదీల్లో ఉయ్యూరు బస్టాండ్ నుంచి తెల్లవారు జామున 4 గంటలకు విజయవాడ మీదుగా వాడపల్లికి బస్సు సర్వీసు నడుస్తుందన్నారు. బస్సు సర్వీసును సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

### బాపులపాడు తహసీల్దార్‌గా నాగభూషణం



**హనుమాన్‌జంక్షన్ రూరల్:** బాపులపాడు తహసీల్దార్‌గా వి.నాగభూషణం గురువారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం ఇక్కడ తహసీల్దార్‌గా పని చేస్తున్న అంకెం శ్రీనివాస్ బదిలీ కావటంతో ఆయన స్థానంలో నాగభూషణం నియమితులయ్యారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన తహసీల్దార్ నాగభూషణంను డెప్యూటీ తహసీల్దార్ వెంకట రమణ, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రాజేష్, సర్వేయర్ ఫణికుమార్, కార్యాలయ సిబ్బంది, వీఆర్వోలు, వీఆర్ఏలు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి, అభినందనలు తెలిపారు.

### రాయితీపై సరుకుల విక్రయం

**గన్నవరం:** స్థానిక రైతుబజార్‌లో పౌర సరఫరాల శాఖ ద్వారా ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్‌లో రాయితీపై విక్రయిస్తున్న బియ్యం, కందిపప్పును ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ ఎస్.ఎస్.పవన్‌కుమార్ గురువారం తెలిపారు. దేశవాళీ కందిపప్పు కేజీ రూ.150కు, స్టీమ్డ్, పచ్చి బియ్యం రూ.48, రూ.47కు విక్రయిస్తున్నామన్నారు. ఈ కౌంటర్ ద్వారా ఇప్పటి వరకు స్టీమ్డ్ బియ్యం 67.83 క్వింటాళ్లు, కందిపప్పు 24.45 క్వింటాళ్లు విక్రయించామని తెలిపారు. స్థానిక ఉషోదయ సూపర్ మార్కెట్‌లోనూ కందిపప్పు, బియ్యం విక్రయిస్తున్నామన్నారు.

# సామాజిక పింఛన్ల పంపిణీ



గండిగుంటలో పింఛన్ ఇస్తున్న ఎమ్మెల్యే బోడె



ప్రసాదంపాడులో పింఛన్ ఇస్తున్న ఎమ్మెల్యే యార్లగడ్డ

**పెనమలూరు:** రాష్ట్ర ప్రభుత్వం పింఛన్ లబ్ధిదారులకు సకాలంలో పింఛన్లు పంపిణీ చేస్తోందని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. ఆయన గురువారం వైఎస్సార్ తాడిగడప మున్సిపాలిటీ పరిధి పోరంకి బీజేఆర్ నగర్‌లో పింఛన్లు అందజేశారు. కార్యక్రమంలో తాడిగడప మున్సిపాలిటీ కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు, టీడీపీ మున్సిపాలిటీ అధ్యక్షుడు అనుమోలు ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు. పెనమలూరు మండలంలో 98 శాతం పంపిణీ చేశామని ఎంపీడీఓ కుమార్‌బాబు తెలిపారు. వలంటీర్ల సాయంతో సచివాలయ సిబ్బంది పింఛన్లను పంపిణీ చేశారు. వలంటీర్ల వద్ద సమాచారం తీసుకొని లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్లు అందజేశారు. సామాజిక పింఛన్ల పంపిణీకి సకాలంలో విధులకు హాజరు కాలేదని పలువురు ఉద్యోగులకు చార్జ్ మెమోలు జారీ చేశారు. పెనమలూరు మండల పరిధిలో పెదపులిపాక గ్రామ పంచాయతీ కార్యదర్శి పద్మావతి దేవి, వణుకూరు సచివాలయం - 2 వీఏఏ బాణావత్ కిరణ్మయి ఉదయం 7.30 గంటలకు లాగిన్ అవ్వటంతో వారికి మెమోలు జారీ చేశారు. అలాగే వైఎస్సార్ తాడిగడప మున్సిపాలిటీలో సచివాలయ సిబ్బంది 8 మంది సకాలంలో విధులకు హాజరు కాలేదు. ఆలస్యంగా విధులకు వచ్చినందుకు కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు మెమో ఇచ్చామని తెలిపారు.

**పింఛన్ల పంపిణీ 98 శాతం పూర్తి**

**కంకిపాడు:** సామాజిక పింఛన్ల పంపిణీ తొలి రోజు 98 శాతం పూర్తి చేశారు. పింఛన్ పంపిణీని ఇన్‌చార్జి ఎంపీడీఓ ఉదయ్‌భాస్కర్ పర్యవేక్షించారు. పునాదిపాడు గ్రామానికి చెందిన పింఛన్ లబ్ధిదారుడు టి.శ్రీనివాస్ అనారోగ్యంతో ఎన్ఆర్ఐ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండటంతో విషయం తెలుసుకున్న పంచాయతీ కార్యదర్శి బి.వెంకటేశ్వరరావు ఆస్పత్రికి వెళ్లి పింఛన్ నగదును అందజేశారు.

**గండిగుంటలో ఎమ్మెల్యే బోడె అందజేత**

**ఉయ్యూరు:** ఉయ్యూరు పట్టణంలోని 20 వార్డులు, మండలంలోని 11 గ్రామాల్లో సచివాలయాల సిబ్బంది గురువారం ఇంటింటికీ వెళ్లి పింఛన్లు అందించారు. గండిగుంటలో లబ్ధిదారులకు పింఛన్లను ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అందించారు. ఉయ్యూరు మున్సిపాలిటీలో మాజీ ఎమ్మెల్సీ వైవీబీ రాజేంద్రప్రసాద్ పింఛన్లు పంపిణీ చేశారు. మున్సిపల్ చైర్మన్ వల్లభనేని సత్యనారాయణ(నాని), కమిషనర్ పాయసం వెంకటేశ్వరరావు పర్యవేక్షించారు.

**రామవరప్పాడులో ఎమ్మెల్యే పంపిణీ**

**రామవరప్పాడు:** మండల పరిధిలోని రామవరప్పాడు, ప్రసాదంపాడు, ఎనికేపాడు, నిడమనూరు, గూడవల్లి గ్రామాల్లో గురువారం ఎన్టీఆర్ భరోసా పింఛన్లను ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు పంపిణీ చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం పెంచిన పింఛన్లను లబ్ధిదారుల ఇంటి వద్దకే వెళ్లి అందజేశామన్నారు. ప్రసాదంపాడు సర్పంచ్ సర్నాల గంగారత్నం బాలాజీ, రామవరప్పాడు మాజీ ఉప సర్పంచ్ కొల్లా ఆనంద్‌కుమార్, ఆయా గ్రామాల్లోని నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

**రూరల్‌లో 93.03 శాతం పింఛన్ల అందజేత**

**విజయవాడరూరల్:** విజయవాడ రూరల్ మండలంలో 93.03 శాతం పింఛన్లు అందజేశామని ఇన్‌చార్జి ఎంపీడీఓ బీఎల్‌వీ శేషగిరిరావు తెలిపారు. మిగిలిన లబ్ధిదారులకు శుక్రవారం అందజేస్తామని చెప్పారు.

**ఉంగుటూరులో 98.30 శాతం పంపిణీ**

**ఉంగుటూరు:** మండలంలో సామాజిక పింఛన్ల పంపిణీ 98.30 శాతం పూర్తి చేసినట్లు ఎంపీడీఓ మహేశ్వరరావు తెలిపారు. మండల పరిషత్ ఏఓ ఎస్.బసవయ్య, కార్యదర్శి ప్రసాద్, సచివాలయ ఉద్యోగులు, వీఆర్వోలు పాల్గొన్నారు.

**■ పంచాయతీ ట్రాక్టర్ డ్రైవర్‌కు గాయాలు**

**నున్న(విజయవాడరూరల్):** నున్న గ్రామ పంచాయతీ చెత్త రవాణా చేసే ట్రాక్టర్ డ్రైవర్ తగరం కుమార్(30)కు గురువారం రాత్రి పోలవరం కాల్వ వద్ద జరిగిన ప్రమాదంలో గాయాలయ్యాయి. ప్రత్యక్ష సాక్షుల కథనం మేరకు చెత్తను డంప్ చేసి తిరిగి వస్తున్న క్రమంలో ఇనుప గడ్డర్ ఒరిగి ట్రాక్టర్‌పై పడింది. ఈ సంఘటనలో గాయపడిన కుమార్‌ను చికిత్స నిమిత్తం స్థానిక ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. డ్రైవర్‌ను వైఎస్సార్ సీపీ గ్రామ పార్టీ కన్వీనర్ పోలారెడ్డి చంద్రారెడ్డి, ఉప సర్పంచ్ కలకోటి బ్రహ్మానంద రెడ్డి, దండు సుబ్రహ్మణ్యం రాజు, ఎంపీటీసీ సభ్యుడు ప్రత్తిపాటి రవీంద్ర, వార్డు సభ్యులు శ్రీనివాసరావు, సుందరయ్య పరామర్శించారు.